రణరంగం



మేయర్ పోడియం వద్ద బడ్జెట్ ప్రతులను చించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

హాజరైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

సమావేశానికి హాజరైన కలెక్టర్, కమిషనర్

రసాభాసగా బల్దియా బడ్జెట్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: వరంగల్ నగరాభివృద్ధికి నిర్వహించిన బల్దియా 2024-2025 బడ్జెట్ సమావేశం రసాభాసాగా సాగింది. జీడబ్ల్యూఎంసీ సమావేశ మందిరం గురువారం అరుపులు, కేకలతో దద్దరిల్లింది. అయితే ముందుగా అనుకున్నట్టుగానే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 21 మంది, బీజేపీకి చెందిన 11 మంది కార్పొరేటర్లతో పాటు కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు ఉదయం 11 గంటలకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్దకు చేరుకున్నారు. కొందరు నల్లబ్యాడ్జీలు, నల్ల కండువాలు ధరించి బడ్జెట్ సమావేశానికి హాజరుకాగా, మరికొందరు నల్ల దుస్తులు వేసుకుని వచ్చారు. కొందరు కార్పొరేటర్లు ఎంజీఎం సర్కిల్ ముందు నుంచి నినాదాలు చేసుకుంటూ కౌన్సిల్ హాల్ వద్దకు వచ్చారు. 'బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించండి.. పార్టీ మారిన మేయర్ సభ్యత్వాన్ని రద్దు చేయండి'.. అంటూ నినదించారు. వీరిని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి బల్దియా ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. నినాదాలు మానుకుంటేనే లోనికి అనుమతిస్తామని చెప్పడంతో వెనక్కి తగ్గిన అసంతృప్తి కార్పొరేటర్లు 11.30గంటలకు కౌన్సిల్ హాల్‌లోకి వచ్చారు. అయితే అంతకుముందే బల్దియా పాలక మండలి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు మేయర్ గుండు సుధారాణి సమావేశమయ్యారు. బడ్జెట్ సమావేశంలో వ్యవహరించాల్సిన తీరుపై మాట్లాడుకున్నారు. తర్వాత ఎమ్మెల్యేలు, మేయర్, కాంగ్రెస్ కార్పొరేటర్లు జట్టుగా కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు.

అయోమయం, గందరగోళం

బల్దియా కౌన్సిల్ హాల్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మేయర్, కార్పొరేటర్లు చేరుకుని వారి వారి స్థానాల్లో ఆసీనులయ్యారు. అంతకుముందే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మరోపక్క కూర్చున్నారు. మేయర్‌ను చూడగానే ఒక్కసారిగా పెద్దగా నినాదాలు చేశారు. తమ పార్టీలో గెలిచి పార్టీ మారిన మేయర్ గుండు సుధారాణికి మేయర్ కుర్చీలో బడ్జెట్ ప్రకటించే అర్హతలేదని ఒక్క సారిగా లేచారు. 'మేయర్ డౌన్ డౌన్.. అర్హత లేని మేయర్ గద్దె దిగాలి' అని విపక్ష కార్పొరేటర్లు నినాదాలు చేశారు. హాల్‌లో గందరగోళ వాతావరణం నెలకొంది. 'బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన మేయర్ గుండు సుధారాణి సభ్యత్వం రద్దు చేయాలి.. ప్రజా సమస్యలు పట్టించుకోని మేయర్ వేస్ట్.. వేస్ట్' అని నినాదాలు చేసి ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో కౌన్సిల్ హాల్‌లో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లు తిరగబడ్డారు. 'కాంగ్రెస్ జిందాబాద్.. తెలంగాణ వచ్చింది కాంగ్రెస్‌తోనే.. తెలంగాణ ఇచ్చింది సోనియమ్మ..' అని ప్రతి నినాదాలు చేశారు. ఇలా పది నిమిషాల పాటు బడ్జెట్ సమావేశం ఉద్రిక్తంగా సాగింది. కాగా, కౌన్సిల్ హాల్ వేదికగా ఇరు పక్షాలు నినాదాలు చేస్తుండగానే మేయర్ గుండు సుధారాణి మూడు పేజీలతో కూడిన బడ్జెట్ ముసాయిదా ప్రణాళికను ప్రవేశపెట్టారు. గొడవ జరుగుతుండగానే బడ్జెట్‌తో పాటు ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. మెజారిటీగా ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు బడ్జెట్ ప్రతిపాదనను ఆమోదించారు. మొత్తంగా పది నిమిషాల్లో బడ్జెట్ సమావేశం నిరసనలు, నినాదాల మధ్య ముగిసింది.

- నిరసనలు, నినాదాలతో దద్దరిల్లిన కార్పొరేషన్
- నల్లకండువాలు, బ్యాడ్జీలతో వచ్చిన విపక్ష కార్పొరేటర్లు
- సుధారాణికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన
- మేయర్ పోడియం వద్ద బడ్జెట్ పత్రాల చించివేత
- పోటాపోటీగా అడ్డుకున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు
- కౌన్సిల్ కార్యాలయం పోలీసుల భారీ బందోబస్తు

బడ్జెట్ పత్రాలను చింపి..

మేయర్ గుండు సుధారాణి 2024- 2025 బడ్జెట్ ముసాయిదాను ప్రకటించిన తర్వాత మెజారిటీ సభ్యులు ఆమోదించారు. దీన్ని జీర్ణించుకోలేని విపక్ష నాయకులు ఒక్కసారిగా మేయర్ కూర్చున్న పోడియం వద్దకు దూసుకువచ్చారు. వెనకాల కూర్చున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు ముందుకు పరుగులు తీస్తూ 'మేయర్ మొండి వైఖరి నశించాలి..' అని నినాదాలు చేస్తూ వారి వద్ద ఉన్న బడ్జెట్ పత్రాలను మేయర్, ఎమ్మెల్యేల ముందే పోడియం వద్ద చింపి పడేశారు. మేయర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, దేశంలో ఎక్కడాలేని విధంగా వరంగల్ బల్దియాలో జరుగుతోందని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని నిరసనకారులు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. 'వుయ్ వాంట్ జస్టిస్'.. అంటూ హాల్ నుంచి బయటకు వచ్చారు.

పోలీసుల భారీ బందోబస్తు

వరంగల్ బల్దియాలో ఈ నెల 20న బడ్జెట్ సమావేశం జరుగుతున్న నేపథ్యంలో వరంగల్ ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు పోలీసులను రంగంలోకి దించారు. సమావేశానికి వస్తున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లను ప్రధాన గేటు వద్ద నిలిపి తనిఖీలు చేసి మరీ పంపించారు. కొందరు మహిళా కార్పొరేటర్లను మహిళా పోలీసు సిబ్బంది తనిఖీ చేయడం వివాదాస్పదంగా మారింది. దీనిని మహిళా కార్పొరేటర్లు తీవ్రంగా ఖండించారు. ఇంకా కార్పొరేట్లతోపాటు వారి వాహన డ్రైవర్లను సైతం తనిఖీ చేసి నల్లజెండాలు ఉన్నాయా? ఇంకా ఏమైనా తెస్తున్నారా? అని అడిగి

మిగతా 8వ పేజీలో..

రూ.650కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

- సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం..
- మేయర్ గుండు సుధారాణి

వివరాలు 7లో..





ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, కార్పొరేషన్ వద్ద పోలీసుల బందోబస్తు

ప్రతి రైతుకు పథకాలందేలా కృషి



- ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- చైర్మన్ పదవితో బాధ్యత మరింత పెరిగింది..
- డీసీసీబీ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.1,931కోట్లకు తెచ్చా..
- 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ
- పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తిని కాదు..
- భవిష్యత్తు రాజకీయాల గురించి ఇప్పుడే ఏం చెప్పలేను
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

7

'వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కింది. నాకు వచ్చిన ఈ అవకాశంతో ఓరుగల్లు రైతుల అభివృద్ధికి కృషి చేస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకం చేరేలా దృష్టి పెడతా. ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకొచ్చా. మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించా' అని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. భవిష్యత్తు రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేనని, పదవుల కోసం తాను పార్టీ మారే వ్యక్తిని కాదని, టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు మేలు జరుగుతోందంటున్న మార్నేని రవీందర్‌రావు గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



నల్లబ్యాడ్జీలతో విధుల్లో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు

నేటి నుంచి జూడాల నిరసన

వరంగల్ మెడికల్, జూన్20: సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పెడచెవిన పెడుతోందని జూనియర్ డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమ్మె నోటీసు ఇచ్చి మూడు రోజులు దాటుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో నిరసనలకు పూనుకున్నారు. ఈ మేరకు శుక్రవారం నుంచి నల్లబ్యాడ్జీలు, దుస్తులు ధరించి నిరసన తెలుపనున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. గురువారం నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వర్తించిన జూనియర్ డాక్టర్లు.. శుక్రవారం నుంచి నల్ల దుస్తులతో తమ నిరసనను ప్రభుత్వానికి తెలియపరుస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో నర్సులు

వివరాలు: 7లో

80 తులాల బంగారం అపహరణ

కేసు నమోదు చేసిన పోలీసులు

మట్టెవాడ, జూన్ 20: యజమాని వద్ద నమ్మకంగా ఉంటూ యజమాని షాపులో లేని సమయంలో 80 తులాల బంగారంతో పరారైన ఘటన వరంగల్‌లో విశ్వకర్మ వీధిలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ విశ్వకర్మవీధిలో మనే సంజయ్ బంగారం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. వ్యాపారి వద్ద బంగారాన్ని కరిగించే బట్టీలో పనిచేసేందుకు మహారాష్ట్రలోని భాగ్యనగర్ గ్రామానికి చెందిన సురేశ్ మూడు వారాల కితం పనిలో చేరాడు. ఈనెల 14న యజమాని వైద్య పరీక్షల నిమిత్తం బయటికి వెళ్లాడు. ఆ సమయంలో తాళాలు మరిచిపోవడంతో షాపులో పనిచేసే సురేష్ ఆ తాళాలతో షాపులో ఉన్న 800 గ్రాముల (80తులాలు)బంగారాన్ని అపహరించాడు. బంగారం విలువ రూ. 48లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

కేసు నమోదులో జాప్యం

జూన్ 14న 800గ్రాముల బంగారం చోరీకాగా, పోలీసులు 19న కేసు నమోదు చేశారు. బాధితుడు 14న పోలీసు స్టేషన్‌లో, ఆ తదుపరి వెంటనే వరంగల్ ఏసీపీకి స్వయంగా కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు చేసిన ఐదు రోజుల తర్వాత కేసు నమోదు చేయడంపై బంగారు వ్యాపారులు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. కేసు నమోదుపై పోలీసులు ఎందుకు జాప్యం చేశారని వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. బంగారం దొంగిలించిన వెంటనే, ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు అప్రమత్తమై వరంగల్ నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ల ప్రాంతాల్లో గాలింపు చేపడితే నిందితుడు పట్టుబడే అవకాశం ఉండేదని చర్చ సాగుతోంది.

పరిశుభ్రతను పాటించాలి

విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత అవసరం

కలెక్టర్ సత్య శారదాదేవి



ఖిలావరంగల్‌లో విద్యార్థినికి నులిపురుగుల నివారణ మందు వేస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలావరంగల్, జూన్ 20: విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కలెక్టర్ సత్య శారదాదేవి సూచించారు. గురువారం ఖిలావరంగల్ మధ్యకోటలోని ప్రభుత్వ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల జాతీయ దినోత్సవం (డీ వార్మింగ్ డే) సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకటనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటివద్ద, పాఠశాల ఆవరణలో ఆటలు, పాటలు ఆడేటప్పుడు ఆరు బయట దుమ్ము, ధూళిలో తిరిగినప్పుడు కచ్చితంగా స్నానం చేయాలని సూచించారు. నులిపురుగుల జాతీయ వారోత్సవాల సందర్భంగా ఏడాదికి రెండుసార్లు విద్యాసంస్థల్లో నివారణ మాత్రలు ఇవ్వడం జరుగుతోందన్నారు. 1నుంచి 19ఏళ్ల లోపు వారు తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,90,718 మంది 19 ఏళ్లలోపు బాలలు ఉన్నారని, వారికి అంగన్‌వాడి సెంటర్, విద్యా సంస్థల్లో ఉచితంగా మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఎలాంటి ప్రమాదాలు ఉండవన్నారు. ఏమైనా సమస్య వచ్చినట్లయితే ప్రతి ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి, ఆర్‌బీ ఎస్‌కే మొబైల్ హెల్త్ టీమ్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా తమ పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ జిల్లా విద్యాశాధికారి వాసంతి, జిల్లా వేల్ఫేర్ ఆఫీసర్ హైమావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, కార్పొరేటర్ బైరబోయిన ఉమా -దామోదరయాదవ్, హెచ్‌ఎం బి.ప్రసాద్, పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..

వరంగల్ కలెక్టరేట్: పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని ఆదేశించారు. బ్యాంకర్లు రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల స్థాపన కోసం వచ్చిన దరఖాస్తులను ఏ శాఖ వద్ద పెండింగ్ ఉండకూడదని, నిర్ణీత కాల వ్యవధిలోనే అనుమతించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టీఎస్ ఐపాస్ కింద నూతనంగా 20 పరిశ్రమలు స్థాపించడానికి 42 రకాల అనుమతులు కమిటీ ఉందన్నారు. రూ.59.47 కోట్ల పెట్టుబడి ద్వారా 221 మంది ఉపాధి కలుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ సంతోష్, జిల్లా గిరిజన శాఖ అభివృద్ధి అధికారి సౌజన్య, విద్యుత్ శాఖ డీఈ ఆనంద్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, ఫ్యాక్టరీలు, కాలుష్య నియంత్రణ మండలి, కుడా, డీటీసీపీ, వాణిజ్య పన్నుల శాఖ, రవాణాశాఖ, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేటర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం



ఆసనం వేసిన వరంగల్‌లోని రంగశాయిపేటకు చెందిన అభినవ్ తేజ్ (ఫైల్)

ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

మానసిక ఒత్తిడీ దూరం..

ప్రపంచ వ్యాప్తంగా యోగాకు పెరుగుతున్న ఆదరణ

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

వరంగల్ కల్చరల్/వర్ధన్నపేట రూరల్, జూన్ 20 : మానసిక ఒత్తిడిలను తగ్గించే మంత్రంగా, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సంజీవనిలా యోగా ఎంతో ఉపయోగపడుతుంది. అనాదిగా భారతీయ జీవన విధానంలో అంతర్భాగమైన యోగా నిత్య జీవన విధానంలో ఒకటిగా కొనసాగుతోంది. మానవ ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆరోగ్యం అంటే అందరూ శరీరానికి సంబంధించినదని అనుకుంటారు. కానీ నిజమైన ఆరో గ్యానికి మూలాలు మనస్సులో ఉంటాయి. వందల ఏళ్ల క్రితం ప్రారంభమైన యోగా, కర్మ, భక్తి యోగాలను పతంజలి మహర్షి యోగా విద్యతో అష్టాంగ మార్గాలను బోధించారు. నాటి నుంచి నేటి వరకు యోగా అనేది జీవన ప్రక్రి యలో ప్రధాన భాగంగా నిలి చింది. మానసిక, శారీరక ఆరోగ్య సాధనతో ధ్యాన సిద్ధి, మంత్రసిద్ధి, సమాధి స్థితి పొందడం యోగాలో ప్రధాన మైనవి ప్రాచీనమైన యోగాసనాలనుఏడాదిలో ఒక రోజు నా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకోవాలని ఐక్య రాజ్య సమితిలో 2014లో ఆమోదించారు. ప్రతీ ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకోవాలని నిర్ణయం జరిగింది. ఇందులో భాగంగానే దేశంలో 2016లో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో ప్రారంభంకాగా నాటినుంచి దేశ వ్యాప్తంగా అధికారికంగా యోగాదినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

జిల్లావ్యాప్తంగా నేడు శక్రవారం రోజున అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో కలెక్టర్, పోలీసు కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు వేడుకల్లో పాల్గొననున్నారు. అలాగే, విద్యాసంస్థల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో, ఆలయాల్లో, మైదానాల్లో, క్రీడా ప్రాంగణాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఉన్న యోగా సెంటర్లు, యోగా కేంద్రాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా యోగా దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. వరంగల్‌లోని దత్తక్షేత్రంలో క్రియా యోగా సాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో, మానసిక బలంతో నిత్యం యవ్వనంగా జీవించవచ్చు. రోజు కొద్ది సేపు యోగా చేస్తే ఆస్పత్రికి పరుగు తీయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. యోగాకున్న సమగ్రత, సంపూర్ణత్వం మరే ఇతర సాధారణ వ్యాయామాలకు ఉండదు. పాశ్చాత్య ప్రపంచం కూడా ఇప్పుడు యోగా పట్ల ఆకర్షితులవుతున్నారు. యోగాసనాలతో రక్త ప్రసరణ మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. నరాల లోపల ఏదైనా అడ్డుపడితే వాటిని తొలగిస్తుంది. క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా వృద్ధాప్యంలో వచ్చే బోలు ఎముకల వ్యాధి, కీళ్ల నొప్పులను నివారిస్తుంది.

నేడు నగరానికి చిన్నజీయర్ స్వామి రాక

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్, హనుమకొండ వికాస తరంగిణి వారి ఆధ్వర్యంలో దేశాయిపేటలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఉదయం 7నుంచి 9గంటల వరకు నిర్వహించే యోగా కార్యక్రమంలో శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామిజీ పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి పెండింగ్ నాలుగు బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, స్వామి, వీరస్వామి, మల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో నర్సులు

ఎంజీఎంలో వేతనాలు రాక రెగ్యులర్ నర్సుల అవస్థలు

వరంగల్ మెడికల్, జూన్ 20: ఎంజీఎం ఆస్పత్రిలో కొన్ని నెలల కిందట రెగ్యులర్ ప్రాతిపదికన నియామకమైన 127 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బోధన ఆస్పత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్ల నియామకమయ్యారు. ఇందులో 127మంది నర్సింగ్ ఆఫీసర్లు రెగ్యులర్ పద్ధతిలో ఎంజీఎంకు కేటాయించబడ్డారు. అయితే వీరికి ఎంప్లాయ్ ఐడీ, సీపీఎస్ నెంబరు కోసం ఎంజీఎం నుంచి ఖజానా కార్యాలయానికి పంపించాల్సి ఉంది. కానీ కొందరి నిర్లక్ష్యం వల్ల ఇంతకాలంగా జీతాలు అవడం లేదని వాపోతున్నారు.

కేఎంసీలో వేతనాల రికవరీ

కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆఫీసర్ల జీతాల్లో కోత విధిస్తామని అధికారులకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 138 మంది 2021 జూన్ 13వ తేదీన నియామకం అయ్యారు. వీరికి ప్రతీ నెల రూ. 25,140 జీతంగా చెల్లించారు. ఆ తరువాత 2022వ సంవత్సరం నుంచి 30శాతం జీతం పెరిగిందని, ప్రతీ నెల రూ.32వేలు జీతం చెల్లించారు. అయితే ఇంతకాలం చెల్లించాక పెరిగిన జీతం మీకు వర్తించదని పేర్కొం టూ ప్రతీ ఒక్క కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్ రూ.84 వేలు చెల్లించాల్సిందే నని హుకుం జారీ చేశారు. ఇది కూడా ప్రతీ నెల జీతంలో రికవరీ చేస్తామని కేఎంసీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మాట్లాడితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి

● ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

తనకు వచ్చిన అవకాశంతో ఉమ్మడి జిల్లా రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, ప్రతీ ప్రభుత్వ పథకాన్ని రైతులకు చేర్చే విధంగా దృష్టి పెడతానని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులైన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు. వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కిం దని, ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకవచ్చానని, మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించానని వివరించారు. పదవుల కోసం పాకులాడే తత్వం తనది కాదని, తనకు ఈ టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టెస్కాబ్ చైర్మన్ పదవి రావటంపై మీ స్పందన?

మార్నేని రవీందర్‌రావు : వరంగల్ సహకార బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవి దక్కింది లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో టెస్కాబ్ చైర్మన్ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉంది. తొలిసారి వరంగల్‌కు వచ్చిన ఈ పదవితో ఓరుగల్లు రైతులకు సాధ్యమైనంత వరకు మేలు చేసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు డీసీసీబీల ద్వారా చేరేలా కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: చైర్మన్ పదవి వస్తుందనే కాంగ్రెస్‌లోకి వెళ్లారా?

మార్నేని: అసలు టెస్కాబ్ చైర్మన్ పదవిపై ఎప్పుడూ ఆశ కూడా పడలేదు. పదవుల కోసం పార్టీ మారే వ్యక్తిని కాదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారం టీలను అమలు చేస్తున్న విధానం నాకు నచ్చింది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అమలుకు శ్రీకారం చుడుతున్న దమ్మున్న సీఎం రేవం త్‌రెడ్డి. ఆయన నాయకత్వంలో పని చేస్తే రైతులకు మేలు జరుగుతుందనే ఆశతో కాంగ్రెస్‌లో చేరా. నేను కాంగ్రెస్‌లో చేరిన తరువాతే టెస్కాబ్ చైర్మన్ స్థానం ఖాళీ అయింది. ఊహించని విధంగా నాకు చైర్మన్ పదవి దక్కింది. దీంతో ఈ పదవితో వరంగల్ రైతులకు సేవ చేయాలనే బాధ్యత మరింత పెరిగింది.

ఆంధ్రజ్యోతి: డీసీసీబీ చైర్మన్‌గా సాధించిన ప్రగతి ఏంటి?

మార్నేని: 2020లో డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు రూ.870కోట్ల టర్నోవర్ మాత్రమే ఉండేది. ఈ నాలుగేళ్ల కాలంలో రూ.1,930.70కోట్లకు బ్యాంకుల లావాదేవీలు పెంచాము. అంతేకాకుండా ఎంపీఏ రేటు 7.5శాతంగా ఉండేది. ప్రస్తుతం 2.99 శాతానికి చేర్చాం. చాలావరకు మొండి బకాయిలను వసూలు చేశాం. కొత్తగా 12 బ్యాంకులను ఏర్పాటు చేశాం. మరో 11బ్యాంకుల ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం. మొత్తం రూ.1,395.18కోట్ల రుణాలు ఇవ్వగా, ఇందులో వ్యవసాయ రుణాలు రూ.573.73కోట్లు కాగా, వ్యవసాయేతర రుణాలు రూ.822.50కోట్లు ఇచ్చాం. రూ.540.56కోట్ల డిపాజిట్లు సేకరించి రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీని అగ్రగామిగా నిలబెట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలిచ్చారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70సహకార సంఘాలు ఉండగా, 78,432మంది సభ్యు లున్నారు. 32డీసీసీబీ బ్యాంకుల బ్రాంచిలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గత డిసెంబరు 9వ తేదీలోపు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే వ్యవసాయేతరమైన దీర్ఘకాలిక (ఎల్‌టీ), గోల్డ్, ఎస్‌ఏవో, జేఎల్‌జీ, ఎడ్యుకేషన్, హౌసింగ్, వాహనాలు, వ్యక్తిగత తదితర 18రకాలకు పైగా రుణాలకు రూ. 1395.18కోట్లు డీసీసీబీ ద్వారా అందించటం జరిగింది. నాబార్డు సహకారంతో ఆత్మ నిర్బర్ అభియాన్ భారత్‌ను అమలు చేస్తున్నాం. దీని ద్వారా రూ.2కోట్ల వరకు రుణాన్ని ఏడేళ్లలో చెల్లించేలా కేవలం 8పైసల వడ్డీకే అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తగా బ్యాంకులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్ల కాలంలో కొత్తగా 12బ్యాంకులను ఏర్పాటు చేశాం. పర్వతగిరి, పాలకుర్తి, కొడకండ్ల, కేసముద్రం, చిట్యాల, ఏటూరునాగారం, ధర్మసాగర్, ఐనవోలు, మొగిలిచర్ల, తరిగొప్పుల, ములుగు గణపురం, నల్లబెల్లి కేంద్రాల్లో కొత్త బ్రాంచిలను ప్రారంభించాం. అలాగే కురవి, మొగుళ్లపల్లి, దేవురుప్పుల, రఘునాథపల్లి, సంగెం, హసన్‌పర్తి, మంగపేట, గీసుకొండ, నర్సింహులపేట, బచ్చన్నపేట, నెల్లికుదురు తదితర 11ఏరియాల్లో నూతన బ్యాంకుల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: మీ తదుపరి లక్ష్యం ఎమ్మెల్యే సీటుపైనేనా?

మార్నేని: భవిష్యత్ రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేం. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన



అయితే లేదు. కానీ, మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా కొనసాగుతున్నా. పీఏసీఎస్ చైర్మన్‌గా, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, ప్రస్తుతం టెస్కాబ్ చైర్మన్‌గా పని చేస్తున్నాను. ఏ పదవిలో ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించటం పైనే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఓరుగల్లు రైతులకు మేలు జరిగేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పని చేస్తున్నా.

రూ.650 కోట్ల బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం : మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: వరంగల్ నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరానికి ముసాయిదా బడ్జెట్ అంచనాల మేరకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక మండలి ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ పర్యవేక్షణాధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.650.12కోట్ల అంచనాలతో రూపొందించి న బడ్జెట్‌కు మెజారిటీ సభ్యులు చేతులెత్తి అంగీకారం తెలుపడంతో పాలకవర్గం బడ్జెట్‌ను అమోదించింది. ఇందులో రూ.237.02 కోట్లు సాధారణపన్నుల ద్వారా, రూ.410.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతుందని అవచనా వేశారు.

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మునిసిపల్ పట్టణ అభివృద్ధి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. తాను మేయర్‌గా కొలువుదీరిన తర్వాత 2024-25 బడ్జెట్‌ను కలుపుకుని మూడోసారి బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈయేడు బడ్జెట్‌లో ప్రజలపై ఎక్కువ పన్నుల భారం మోపకుండా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ గ్రేటర్ 66 డివిజన్‌ల అబివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రధానంగా విలీనగ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్‌తో పాటు వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ ఎఫీషియో సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా ఆదాయం

ట్యాక్స్ రెవెన్యూ	రూ.8,98కోట్లు
అసైన్డ్ రెవెన్యూ కంపన్‌సేషన్	------------
మున్సిపల్ ఆస్తుల అద్దెలు	రూ.12,66కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 86,04కోట్లు
శానిటేషన్	రూ.18,97కోట్లు
ఇంజనీరింగ్	రూ.29,55కోట్లు
మొత్తం	రూ. 237,02కోట్లు

ఖర్చులు

సిబ్బందికి జీత భత్యాలు	రూ.80కోట్లు
పారిశుద్ధ్య నిర్వాహణకు	రూ.25,80కోట్లు
విద్యుత్ చెల్లింపులు	రూ.18,45కోట్లు
గ్రీన్ బడ్జెట్ 10 శాతం	రూ. 23,70కోట్లు
ఇంజనీరింగ్ విభాగానికి	రూ. 25,75కోట్లు
సాదారణ నిర్వాహణకు	రూ. 18,50కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 1.20కోట్లు
డీఆర్ఎఫ్	రూ. 1.50కోట్లు
విలీన గ్రామాల అభివృద్ధికి	రూ. 14,04కోట్లు
ప్రజాసౌకర్యాల కల్పన	రూ. 5,20కోట్లు
వార్డుల అత్యవసర అభివృద్ధికి	రూ. 22,88కోట్లు

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధిత బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతు 2017 సెప్టెంబరు 13న మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాలిక అస్వస్థతతకు గురికావడంతో తల్లి విషయం తెలుసుకున్నది. హన్మంతు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు హన్మంతుపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.హరీష్ విక్రమ్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌చందర్‌రావు, ఇ.హరికృష్ణ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బాలికను బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: ప్రేమించమని, లేదంటే చంపుతానని బాలికను బెదిరించిన కేసులో మారెపెల్లి అనురుధ్‌కు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ఫోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధిత బాలికకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి అనురుధ్ 14 యేళ్ల బాలికను 2019 ఆగస్టు 9న ఉదయం 10.30 గంటలకు తన ఇంటి వెనకాల రాగానే అకస్మాత్తుగా బాలిక వద్దకు వచ్చి నోరు మూశాడు. తనను ప్రేమించాలని, లేదంటే బాలికను, ఆమె కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. దీంతో బాలిక విషయం తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

కేసు విచారణంలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా అంతకుముందు 2019 జనవరి 17న సాయంత్రం 6 గంటలకు బాలిక ఇంటి ముందుకు వచ్చి తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులోకూడా రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, ఈ రెండు కేసుల్లో విధించిన శిక్ష ఏకకాలంలో అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. కోర్టు పీసీ ఎ.రవి, సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎస్సై జి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బదిలీల ప్రక్రియకు కసరత్తు ప్రారంభం



బదిలీల ప్రక్రియ కసరత్తు చేస్తున్న డీఈవో అబ్దుల్‌హై

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీలకు రెండు జిల్లాల విద్యాశాఖలు రంగం సిద్ధం చేస్తున్నాయి. గురువారం రెండు డీఈవో కార్యాలయాల్లో డీఈవోలు సంబంధిత సిబ్బందిని బదిలీల పక్రియను వేగవంతం చేయాలని, ఖాళీలను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. వరంగల్ జిల్లాలో సుమారుగా 556 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక హనుమకొండ జిల్లాలో 452 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యే అవకాశం ఉంది.

స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) నేతృత్వంలో 40 రోజుల పాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 నుంచి క్లాస్‌లు నిర్వహిస్తామని, జూలై 9 వరకు వర్సిటీ విద్యార్థులు ఉద్యోగులు రూ.వెయ్యి, ఇతరులు రూ.15 వందల చొప్పున క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో చెల్లించుకుని దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు కేయూలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సమావేశం

కేయూ క్యాంపస్, జూన్ 20: ఈనెల 22న శనివారం ఉదయం 10.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం సెనెట్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అల్మానాక్, కళాశాలల అనుబంధాలు, పరీక్షల షెడ్యూల్, స్పోర్ట్స్, గేమ్స్, ఎన్ఎస్ఎస్‌తో పాటు ఇతర అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు మంగళవారం తెలిపారు. డీబారైన వారిలో నల్లగొండ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు ఆర్టీసీ శుభవార్త

డీలక్స్ బస్సులో ప్రయాణిస్తే డ్రాలో బహుమతులు

బాలసముద్రం, జూన్ 20: ఆర్టీసీ డిలక్స్ బస్సులో ఉప్పల్ క్రాస్‌రోడ్-హైదరాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళ ప్రయాణికులు టికెట్ పై డ్రా తీసి బహుమతులు ఇవ్వనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబరు రాసి డ్రైవర్ పక్కన ఉండే లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని తెలిపారు. నెలలో రెండు సార్లు డ్రా తీసి ముగ్గురు మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు డిలక్స్ బస్సుల్లో ప్రయాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

శంభునిపేట, జూన్ 20: తెలంగాణలోని రాష్ట్ర స్థాయిలో ఉన్న క్రీడా అకాడమీలు, వసతి గృహాల్లో ప్రవేశాలకై ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా యువజన క్రీడా అధికారిణి టీవీఎల్ సత్యవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశానుసారం హనుమకొండ, ఖమ్మం, వనపర్తి, రాజన్నసిరిసిల్ల, హైదరాబాద్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియాల్లో జూలై 3, 4 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆసక్తి గలవారు సంబంధిత ధృవపత్రాలు, క్రీడలకు సంబంధించిన సర్టిఫికెట్స్‌ను ఎంపిక కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు. హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్, ఖమ్మంలోని అథ్లెటిక్ అకాడమీలలో ప్రవేశాల కొరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఎంపికలు నిర్వహించనున్నారు. వివరాలకు 93929 97668 నెంబరును సంప్రదించగలరని ఆమె తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మైనారిటీ సెల్ నాయకులు



కలెక్టర్ సత్య శారదాదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనారిటీ సెల్ నాయకులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 20: వరంగల్ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్య శారదాదేవిని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నయిమోద్దీన్, ఇస్మాయిల్, షకీల్, గౌస్‌ఖాన్, తస్లీమ్, రషద్, అబ్దుల్లా ఖాన్, యాకూబ్, దస్తగిరి, పసి హాజి తదితరులు పాల్గొన్నారు.

'మార్కెట్ టెండర్లను రద్దు చేయాలి'



మార్కెట్లో కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గుమస్తా సంఘం నాయకులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 20: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో పలు పనుల కోసం ఆహ్వానించిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని మార్కెట్ గుమస్తా సంఘం అధ్యక్షుడు ఇనుముల మల్లేశం ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 1933లో ఏర్పాటైన మార్కెట్ బైలా ప్రకారం నో లాస్, నో బెనిఫిట్ ప్రకారం క్యాంటీన్లను, క్లీనింగ్ పనులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ యార్డులోని ప్రతీ గడ్డెకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పాన్‌షాపులు టెండర్లలో దక్కించుకున్న వారు తాగునీటితోపాటు నిషేధిత పొగాకు సంబంధిత ఉత్పత్తులు అమ్మకాలు జరుపుతున్నారని వివరించారు. ఆహ్వానించిన టెండర్లను రద్దు చేసి బైలా ప్రకారం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సులగం వేణుగోపాల్ పాల్గొన్నారు.

పూల వ్యాపారుల ఇష్టారాజ్యం

• మునిసిపల్ ఆఫీస్, సీకేఎం ఆస్పత్రికి వెళ్లే రోడ్డుపైనే వ్యాపారాలు • ఇబ్బందులు పడుతున్న ప్రజలు • పట్టించుకోని అధికారులు





మునిసిపల్ ఆఫీసు, సీకేఎం ఆస్పత్రి రోడ్డుపైనే పూలు విక్రయిస్తున్న వ్యాపారులు

గిర్మాజిపేట, జూన్ 20: రోడ్లపై ఇష్టారాజ్యంగా పూల విక్రయాలు సాగడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతోపాటు, ఆస్పత్రికి వచ్చిపోయేవారు, నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో బల్దియా షాపింగ్ కాంప్లెక్స్, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి పోయే రోడ్డులో పూల వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డును కబ్జాచేసి యథేచ్ఛగా వ్యాపారం సాగిస్తున్నారు. దీంతో వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో మునిసిపల్ పన్ను కట్టేందుకు వార్డు ఆఫీసుకు వెళ్లేవారు, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిపోయే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు సందర్భాల్లో అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీ వాహనాల నుంచి పూలను అన్‌లోడ్ చేసే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. వ్యాపారులు రోడ్డుపైనే బల్లలు, టేబుల్స్ వేసుకుని విక్రయాలు జరపడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో నగరవాసులు మండిపడుతున్నారు.

మున్సిపల్ వార్డు ఆఫీసుకు దారేదీ?

మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని రెండు మడిగెలను బల్దియా వార్డు కార్యాలయంగా వినియోగిస్తున్నారు. దశాబ్దకాలంగా నడుస్తున్న ఆఫీసులో ఆస్తి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను, ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తు, అసెస్‌మెంట్ కాపీలు తదితర పన్నుల చెల్లింపు జరుగుతుంటాయి. హెడ్ పోస్టాఫీసు నుంచి ఇసుక అడ్డా వరకు, గిర్మాజిపేట, వరంగల్ చౌరస్తా తదితర ప్రాంత ప్రజలు నిత్యం ఈ ఆఫీసుకు వచ్చి పన్నులు చెల్లిస్తుంటారు. ఆఫీసుకు వెళ్లేదారిలో వ్యాపారులు పెద్దపెద్ద బల్లలు, టేబుల్స్ వేసి వాటిపైనే పూల వ్యాపారాలు చేస్తుండటంతో ఆఫీసుకు పోయేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆస్పత్రి రోడ్డుపైనే విక్రయాలు..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ నుంచి సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పోయే రోడ్డులోను పూల వ్యాపారులు పూర్తిగా కబ్జాచేసి విక్రయాలు జరుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుపైనే బల్లలు, టేబుల్స్ వేసి అమ్ముతున్నారు. దీంతో ఆస్పత్రికి పోయేందుకు రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి నిత్యం 500 మంది రోగులు, వారి వెంట వారి సహాయకులు వైద్య సేవల కోసం ఆస్పత్రికి వస్తుంటారు. రోడ్లపైనే సాగుతున్న పూల వ్యాపారాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అలాగే అంబులెన్స్‌లు, ఆటోల రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. ఆస్పత్రికి వెళ్లే రోగులతో పాటు గిర్మాజిపేట నుంచి వరంగల్ హెడ్‌పోస్టాఫీసుకు వెళ్లే నగరవాసులు ఈ రోడ్డంటేనే జంకుతున్నారు. పండుగ, పర్వదినాల్లో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటుందని నగరవాసులు వాపోతున్నారు.

నీట్ అవకతవకలపై విచారణ చేపట్టాలి



అండర్‌బ్రిడ్జి వద్ద నిరసన ప్రదర్శన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఖిలావరంగల్, జూన్ 20: నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అండర్‌బ్రిడ్జి సెంటర్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్రం సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్ర ధాన కార్యదర్శి ల్యాదళ్ళ శరత్, నాయకులు సంఘీ ఏలేందర్, ఎమ్డీ యాకోబు, రాజేందర్, వెంకటాద్రి, ఎంఏ పాషా, తోట సారయ్య, నరసింహారావు, సోమక్క, యాదగిరి, అశోక్, సోమయ్య, బాబు, శేఖర్, పాల్గొన్నారు.

కేంద్రం బాధ్యత వహించాలి

పోచమ్మమైదాన్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అన్నారు. నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ గురువారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీతో లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంద్ర కుమార్, ఎమ్డీ కాశీం, పరికరాల రమేష్, ఐలయ్య, కొయ్యడ మనోహర్, బుల్లె సామిల్, ఎమ్డీ సాదిక్, శ్రీలక్ష్మి, అనూష, వసంత్, భాగ్యశ్రీ పాల్గొన్నారు. పోచమ్మమైదాన్, జూన్ 20: నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సీపీఐ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అన్నారు. నీట్ పరీక్ష లీకేజీని నిరసిస్తూ గురువారం వరంగల్ పోచమ్మమైదాన్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీతో లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంద్ర కుమార్, ఎమ్డీ కాశీం, పరికరాల రమేష్, ఐలయ్య, కొయ్యడ మనోహర్, బుల్లె సామిల్, ఎమ్డీ సాదిక్, శ్రీలక్ష్మి, అనూష, వసంత్, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

బల్దియాలో ఫ్లోర్‌లీడర్ చాంబర్ ప్రారంభం



ఫ్లోర్ లీడర్ చాంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లుకు కేటాయించిన చాంబర్‌ను గురువారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ తోట వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు కుమార్ యాదవ్, మంద రాకేశ్, తోట శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజలపై ఆర్థిక దాడులను ఖండించాలి'



సమావేశంలో ప్రసంగిస్తున్న సుదర్శన్

ఖిలావరంగల్, జూన్ 20: పరపతి సంఘాల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలపై జరుగుతున్న ఆర్థిక దాడులను అరికట్టాలని తెలంగాణ వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిళిచర్ల సుదర్శన్ అన్నారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన వివిధ రాష్ట్రాల సీనియర్ వినియోగ సంఘాల ప్రతినిధుల సమావేశాన్ని సెంట్రల్ కన్స్యుమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) విభాగం అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సుదర్శన్ మాట్లాడుతూ వినియోగదారుల దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో చర్చించామన్నారు.

పత్తి రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

సంగెం, జూన్ 20: పత్తి రైతుకు పంట రుణం ఇవ్వాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ డిమాండ్ చేశారు. సంగెంలో గురువారం అఖిల భారత రైతు సమాఖ్య ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అధ్యక్షత వహించగా రమేష్ ముఖ్య అతిథిగా పత్తి రైతుల సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి కుసుంబ బాబురావు, జిల్లా కోశాధికారి సింగతి మల్లికార్జున్, జిల్లా సహాయ కార్యదర్శి గోనె రామచందర్, నాయకులు సోమిడి రవి, జక్క అశోక్, సదానందం, బాబు, ఐలోని సురేందర్, రమేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న ఏసీపీ, సీఐ

కరీమాబాద్, జూన్ 20: మిల్స్‌కాలనీ, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల్లో పలు ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య ఆధ్వర్యంలో గురువారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ తెలిపారు. గురువారం నిందితులతో పాటు, స్వాధీనం చేసుకున్న ఆరు ద్విచక్ర వాహనాల వివరాలను వెల్లడించారు. రంగశాయిపేట తెలంగాణ కాలనీకి చెందిన జగరి లీకేష్ (18), వరుసకు సోదరుడైన మంచిర్యాల కేంద్రం దొరగారిపల్లె గ్రామానికి చెందిన జగరితేజ (18)తో కలిసి నగరంలోని ఎస్ఆర్ఆర్‌తోట, రంగశాయిపేట, కాజీపేట, జమ్మికుంట ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగలించారన్నారు. వరుస బైక్ దొంగతనాలు జరుగుతుండటంతో సీపీ, ఏసీపీ అదేశాల మేరకు సీఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించినట్టు పేర్కొన్నారు. శంభునిపేట, ఆర్టీకే జంక్షన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టగా ఇద్దరు నిందితులు బైక్ వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వారిని పట్టుకొని విచారించగా అసలు విషయం వెల్లడించారన్నారు. ప్రత్యేక టీంలో పనిచేసిన పోలీసు సిబ్బంది సహదేవ్, భావ్‌సింగ్, వాజీద్, సాంబయ్యలను ఏసీపీ, సీఐలు అభినందించారు.

ఆయుర్వేద వైద్య విద్యార్థుల యోగా వాక్

గిర్మాజిపేట, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం(శుక్రవారం) సందర్భంగా గురువారం నగరంలో అనంతలక్ష్మి ఆయుర్వేద వైద్యకళాశాల, ఆయుర్వేద బోధన ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో యోగావాక్ నిర్వహించారు. అంతర్జాతీయ యోగ దినోత్స వం 2024 థీమ్ యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ పేరుతో నిర్వహించిన వాక్‌ను బోధనాస్పత్రి వద్ద సూపరింటిండెంట్ డాక్టర్ పద్మావతితో కలిసి వైద్యకళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ ప్రా రంభించారు. కార్యక్రమంలో ఆయుష్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్, బోధనాస్పత్రి వైద్యులు జగన్మోహనాచారి, ఎం. రాజు, వైద్య కళాశాల అధ్యాపకులు వసంత, మహేష్, విశ్వఆయుర్వేద పరిషత్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నర్సమ్మ (ఫైల్)

కరీమాబాద్, జూన్ 2: నగరంలోని ఎస్ఆర్‌తోట ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు గురువారం తుది శ్వాస విడిచింది. అందరినీ ఆప్యాయంగా పలకరించే అంకం నర్సమ్మ(106) మృతి చెందడంతో స్థానికులు నివాళులర్పించారు. నర్సమ్మకు ఇద్దరు కుమారులు అంకం సత్యం, అంకం శ్యామ్, కూతురు చంద్రకాంత ఉన్నారు. 30ఏళ్ల క్రితం భర్త చనిపోగా, ఆమె మూడు తరాలలకు చెందిన మనుమరాళ్లు, మనవళ్లు మొత్తం 38 మంది ఉన్నారు.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలి

గీసుగొండ, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో చదువుల సత్యనారాయణ సూచించారు. గురువారం ప్రాథమిక పాఠశాలలకు వర్క్‌బుక్‌లను గీసుగొండ విద్యావనరుల కేంద్రంలో ఆయన గురువారం పంపిణీ చేసి మాట్లాడుతూ బడిబాటలో ఎన్‌రోల్ అయిన పిల్లలను పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పట్టాభి, ముత్యాలు, రవిందర్, ఎంఐఎస్ సారిక, సీఆర్పీలు రాజేష్, రవి, ఆనందం, సుధాకర్, వెంకటరమణి, డీపీ రాజగోపాల్, శంకర్ పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 20: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యంతాగి వాహనం నడిపిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి గురువారం జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి, ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు రూ.వెయ్యి, మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.1200 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

గీసుగొండ, జూన్ 20: మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, కళాశాలలో 1 నుంచి 19 ఏళ్ల వారికి గురువారం నులిపురుగు నివారణ కోసం మందులను వేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన తెలిపారు. మండలంలో 10,840 మంది ఉండగా 10,512 మందికి మాత్రలు వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమార్, స్వరూప, ఏఎన్ఎం, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్య

గిర్మాజిపేట, జూన్ 20: వంచనగిరి శాయంపేట రైల్వే గేటు సమీపంలో గురువారం తెల్లవారుఝామున బెంగళూరు నుంచి ఇటార్సీ వెళ్తున్న ప్రయాగ్‌రాజ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి (35) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ సీఐ జి.నరేష్ తెలిపారు. బుధవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) వెళ్తున్న కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు నుంచి చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌లో దిగిన ప్రయాణికుడు మద్యం మత్తులో అరుస్తూ గొడవ చేయడంతో స్థానిక రైల్వే సిబ్బంది సర్ది చెప్పి రైల్వేస్టేషన్‌లో విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్టు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న అతడు తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సంబంధీకులు 99594 25483/ 87126 58585 లో సంప్రదించాలని సీఐ కోరారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు



శ్రీధర్

గీసుగొండ, జూన్ 20: నిరుపేద నిరక్షరాస్య కుటుంబంలో జన్మించిన గిరిజన యువకుడు ఒకే ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంతో పలువురు అభినందిస్తున్నారు. విశ్వనాథపురంనకు చెందిన వాంకుడోతు శ్రీధర్ టెన్త్ వరకు కొమ్మాల జెడ్పీ పాఠశాలలో, నర్సంపేటలో ఇంటర్, డిగ్రీని ఓ ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీలో కెమిస్ట్రీ పూర్తి చేసిన అతను ఉద్యోగ లక్ష్యసాధనలో పడ్డాడు. మార్చి 4 ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్‌గా, మే 17న ఎన్టీపీసీలో అసిస్టెంట్ కెమిస్ట్ ట్రైనీగా ఉద్యోగాలు సాధించాడు. కాగా తాజాగా ఈనెల 16న కేంద్రప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ శాఖలో ఎగ్జామినర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఉద్యోగం లభించింది. కాగా గెజిటెడ్ పెటెంట్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరటానికి సిద్ధపడుతున్నట్లు శ్రీధర్ తెలిపారు

నేల స్వభావాన్ని బట్టే సాగుచేయాలి

వరంగల్ వ్యవసాయం, జూన్ 20: నేల స్వభావాన్ని బట్టే పంటలు సాగు చేయాలని, అప్పుడే అధిక దిగుబడి వస్తుందని వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు(ఏడీఆర్) డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. నేల అనుకూలత ఆధారిత సాగుపై ఒక రోజు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. నాబార్డు ఆర్థికసాయంతో జరిగిన ఈ కార్యక్రమానికి సాయిల్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.రాములు అధ్యక్షత నిర్వహించారు. ముఖ్యఅతిథి ఉమారెడ్డి మాట్లాడుతూ.. సహజ వనరులైన నేల, నీరు, గాలి వాతావరణం క్రమక్రమంగా క్షామానికి గురవుతుందని, రాబోయే తరాలకు ఆహార ఉత్పత్తిపైన ప్రతికూల వాతావరణాన్ని సృష్టించే ప్రమాదముందని వాపోయారు.

చేపపిల్లల కొనుగోలుకు నగదును అందించాలి

గీసుగొండ, జూన్ 20: చేపల పెంపకం కోసం మత్స్యకారుల సంఘాలకు చేపపిల్లల పంపిణీకి బదులు నగదును ఆయా సంఘాలకు అందించాలని జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ కంబాల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఎలుకుర్తిలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంఘాలకు వివిధ ఏజెన్సీల ద్వారా చేపపిల్లలను ఉచితంగా అందిస్తున్నా, అవినాణ్యంగా ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బూసాని రఘు నాయకులు శ్రీనివాస్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

రణరంగం

5వ పేజీ తరువాయి

కౌన్సిల్ హాల్ లోనికి అనుమతించారు. కౌన్సిల్ హాల్‌లో సుమారు 20 మంది పోలీసులు కౌన్సిల్ హాల్‌లో ఎవరికీ అనుమానం రాకుండా అక్కడక్కడ కూర్చున్నారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఐలతో పాటు మహిళా, పురుష పోలీసు కానిస్టేబుళ్లు హాల్‌లో కూర్చున్నారు. కాంగ్రెస్ విపక్ష కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న తరుణంలో కొందరు మఫ్టీలో ఉన్న పోలీసులను గుర్తించారు. హాల్ నుంచి పోలీసులను పంపించాలని డిమాండ్ చేయడంతో హాల్‌లో ఉన్న పోలీసు సిబ్బంది బయటకు పంపించారు. బడ్జెట్ ఆమోదం తర్వాత ఇరువర్గాల బయట వెళ్లిపోయారు. బల్దియా చరిత్రలో ఉన్నడూ లేని విధంగా బడ్జెట్ సమావేశానికి పోలీసులు హాజరు కావడం, కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయడాన్ని కొందరు నిరసించారు.

నిరసన

కొందరు విపక్ష కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశం నిర్వహించిన తీరుపై మండిపడ్డారు. కౌన్సిల్ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసనకు దిగి బైఠాయించారు. బల్దియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసు బందోబస్తు మధ్య బడ్జెట్ సమావేశం నిర్వహించడం సిగ్గుగా ఉందని మండిపడ్డారు. పోలీసులు కలుగజేసుకుని శాంతింపజేశారు. ఓ కార్పొరేటర్ భర్త మట్టెవాడ ఎస్ఐ చొక్కా పట్టుకోవడంతో కొంత ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులను నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరడంతో సమస్య సద్దుమనిగింది.

బీఆర్ఎస్, బీజేపీలది అక్రమ సంబంధం

నాయిని రాజేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్నట్లుగానే బీఆర్ఎస్, బీజేపీల అక్రమ సంబంధం బల్దియా బడ్జెట్ సమావేశంలో తేట తెల్లమైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండడంవల్ల వరంగల్ కార్పొరేషన్ అభివృద్ధి 20 యేండ్లు వెనక్కి పోయింది. కాకతీయ కళాతోరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటు. పదేళ్లుగా కాకతీయ ఉత్సవాలు చేయకుండా కాకతీయ తోరణం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్, బీజేపీలకు లేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్లు రాకపోవడం వల్ల నిరసనలు, అడ్డగింపులు చేస్తున్నారు. తెలంగాణ చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాన్ని ఎట్టిపరిస్థితిలో తీయనియ్యం. రూ.150కోట్ల స్మార్ట్‌సిటీ నిధులు ఎగిరిపోతుంటే ఎమ్మెల్యేలం తిరిగి తెచ్చాం.

నా రాజకీయ చరిత్రలో ఎప్పుడు చూడలే..

బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

వరంగల్ మునిసిపల్ చరిత్రలో ఈ రోజు జరిగిన సంఘటనలు ఎప్పుడూ చూడలేదు. మంత్రి, ఎమ్మెల్యే హోదాలో పని చేయడంతో పాటు బల్దియాపై నాకు సుదీర్ఘ అనుబంధం కలిగి ఉంది. కానీ మునుపెన్నడూ లేనివిధంగా పోలీసు బందోబస్తు పెట్టి మరీ బల్దియా బడ్జెట్ సమావేశం నిర్వహించిన సందర్భాలు లేవు. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం పోలీసులు వెసులుబాటు కల్పించారు. కానీ బల్దియా సమావేశాన్ని పోలీసుల పహారాలో నిర్వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

రాజకీయ అడ్డాగా బల్దియా

చాడా స్వాతిరెడ్డి, బీజేపీ 52 డివిజన్ కార్పొరేటర్

వరంగల్ బల్దియా కార్యాలయం ప్రజల సంక్షేమం కోసం కాకుండా రాజకీయ అడ్డాగా మారింది. ఇక్కడి ప్రాంత అభివృద్ధిని పక్కనబెట్టి అధికారం కోసం పావులు కదుపుతున్నారు. బల్దియాలో జరిగింది బడ్జెట్ సమావేశం కాదు.. సొంత నిర్ణయాల వేదికగా చెప్పవచ్చు. ప్రభుత్వం మారడంతో మేయర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి కుర్చీ కోసం పాకులాడుతోంది. గత సంవత్సరం, ఈ సంవత్సరం బడ్జెట్‌లు పూర్తిగా ప్రజల మీద భారం మోపే విధంగా ఉన్నాయి. దీనిపై బహిరంగ చర్చకు రావాలి.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 21 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట, జూన్ 20 : నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేశ్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్షను నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గడ్డం యాకయ్య, పిట్టల సతీష్, గడ్డం నాగరాజు, దండు గుల అశోక్, సందీప్, సాంబరాజు, బాదరబోయిన యాదగిరి, పాలక పవన్ పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తా

• మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన హరీశ్‌రెడ్డి



మార్కెట్ నూతన పాలక వర్గం

నెక్కొండ, జూన్ 20 : నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మార్కెట్ ఛైర్మన్‌గా గురువారం పాలక వర్గంతో కలసి బాధ్యతలను చేపట్టిన రావుల హరీశ్‌రెడ్డి అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా వ్యవసాయ మార్కెట్‌కు పాలకవర్గంలేని కారణంగా అభివృద్ధిలో వెనకపడగా, క్రయవిక్రయాల విషయంలో రైతులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురయ్యారన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పాలక మండలి, అధికారుల సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను కనీవిని ఎరగని రీతిలో అభివృద్ధి పరుస్తానన్నారు. వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి చెందిన ఎడ్ల నరేష్‌రెడ్డి, డైరెక్టర్లుగా కునుసోతు నైజాంనాయక్, జమ్ముల సోమయ్య కొత్తపల్లి రత్నం, దూదిమెట్ల కొమురయ్య మహ్మద్ ఖలీల్, మామిడ్ల మల్లయ్య, రావుల మహిపాల్‌రెడ్డి, బొమ్మరబోయిన రమేశ్, సమ్మెట శ్రీనివాస్, కందిక సుమలత, దొడ్డ విజయ్, తాళ్లూరి నర్సింహస్వామిని నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, నెక్కొండ కార్యదర్శి కృష్ణమీనన్, వివిధ పార్టీల నాయకులు, అధికారలు పాల్గొన్నారు.

బావిలో పడిన ఎద్దును కాపాడిన మునిసిపల్ సిబ్బంది

నర్సంపేట టౌన్, జూన్ 20 : ప్రమాదవశాత్తు బావిలో పడిన ఓ ఎద్దును నర్సంపేట మునిసిపల్ సిబ్బంది సకాలంలో బయటకు తీసి కాపాడిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. పట్టణంలోని గౌడ సంఘం ఏరియాలోని తాబేటి శ్రీను ఇంటి సమీపంలోని బావిలో ఓ ఎద్దు ప్రమాదవశాత్తు పడిపోయింది. దీంతో స్థానికులు మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినికి సమాచారం అందించగా ఆమె మునిసిపల్ సిబ్బందిని పిలిపించి క్రేన్ సహాయంతో ఎద్దును బావిలో నుండి బయటకు తీశారు. ప్రాణాపాయం నుంచి ఎద్దు బయటపడింది.

నులిపురుగుల నివారణతోనే పిల్లల ఎదుగుదల

నివారణ దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు

పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



నర్సంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మాత్రలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నర్సంపేట, జూన్ 20: 1నుంచి 19 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలందరూ తప్పకుండా నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని అంగన్ వాడీ టీచర్ నల్ల భారతి,ఆశ కార్యకర్త రాజమణి సూచించారు. నులిపురుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రామాలయం వీధి అంగన్‌వాడీ పాఠశాలలో 120 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ గౌసియా, ఆయా సునీత, శ్రీరామోజు మురళి, తల్లులు అనిత, మౌనిక, సింధు, రమ్య, శ్రావణి, స్పందన, కనకలక్ష్మి పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : విద్యార్థుల ఆరోగ్యం పట్ల వారి తల్లిదండ్రులు ప్రతిఒక్కరూ దృష్టిసారించాలని హెచ్ఎం వేణు సూచించారు. శుక్రవారం మండలంలోని ఉప్పర పెల్లి ప్రభుత్వ పాఠశాలలో నులి పురుగుల జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ బేతి నిఖిల్, అబ్జర్వర్ రాజు, ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, రాజు, లింగమూర్తి, విజయ్, రూపరాణి, సదానందం, పీఈటీ వీరస్వామి, ఏఎన్ఎం రాణి, రమ్య, చైతన్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : నట్టల నివారణతోనే పిల్లల్లో ఎదుగుదల సాధ్యమని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల వయసులోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలువేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1-2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రలు, 2-3 మొత్తం మాత్రలు నీళ్లలోకలిపి తాగించాలన్నారు. 3-19 వయసు గల వారు మొత్తం మాత్ర నమిలి మింగాలని సూచించారు. నులి పురుగులు ఉండడం వలన పిల్లల్లో ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తహీనత సమస్యలుంటాయని సూచించారు.

● చెన్నారావుపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్‌వాడీ సెంటర్‌లలో విద్యార్థులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ విద్యార్థులు నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరావు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, రామెల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● దుగ్గొండి : మండలంలోని దుగ్గొండి, కేశవాపురం పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీచేశారు. దుగ్గొండి పీహెచ్‌సీ పరిధి లో 3114మంది పిల్లలకు, కేశవాపురం పీహెచ్‌సీ పరిధిలో 1091మందికి నులి పురుగు నివారణ మాత్రలు వేసినట్లు డాక్టర్లు కిరణ్‌రాజు, విజయ్‌కుమార్‌తెలిపారు. దుగ్గొండి పీహెచ్‌సీ కేంద్రంలో నులిపురుగు నివారణ మందుల పంపిణీని జిల్లా మాత శిశు సంక్షేమ అధికారి పద్మశ్రీ సందర్శించి పరిశీలన చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో సాంబయ్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యా ధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీచేశారు. ఎంపీడీవో శంకర్ మాట్లా డుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంవల్ల కడుపు లో నులి పురుగులు ఏర్పడకుండా నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఖానాపురం : నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు విద్యార్థులకు మందుల పంపిణీచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోతి, రుచిత, కల్పన, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, కళాశాలలో 1 నుంచి 19 ఏళ్ల వారికి నులి పురుగు నివారణ కోసం మందులను వేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చన తెలిపారు. మండలంలో 10,840 మంది ఉండగా 10,512 మందికి మాత్రలు వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్‌లు కిరణ్‌కుమార్, స్వరూప, ఏఎన్ఎం, ఆశావర్కర్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల విక్రయాన్ని అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



విద్యార్థి సంఘం నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

నెక్కొండ, జూన్ 20 : నెక్కొండ మండల కేంద్రంలోని విద్యోదయ పాఠశాలలో విద్యార్థులకు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం పాఠశాలలో పుస్తకాల విక్రయాలను అడ్డుకున్నారు. దీంతో విద్యార్థి సంఘాల నాయకులతో పాఠశాల యాజమాన్యం వాగ్వివాదానికిదిగారు. పుస్తకాలను ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయించవద్దని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలను ఏ మాత్రం లెక్కచేయకుండా పుస్తకాలను విక్రయిస్తున్నారంటూ విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఫిర్యాదుచేశారని చెప్పారు. పాఠశాలల్లో పుస్తకాల విక్రయిస్తున్న విషయాన్ని తాము డీఈవోకు ఫిర్యాదుచేశామని ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి యారా ప్రశాంత్, నెక్కొండ మండల కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్ తెలిపారు. పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను ఆపివేయాలంటూ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యం ఎస్సై మహేందర్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పాఠశాలకు చేరుకొని విద్యార్థి సంఘాలను శాంతింప చేశారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో రత్నమాల పాఠశాలలో పుస్తకాలు నిలువ ఉన్న గదిని సీజ్‌చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని డీఈవోకు తెలుపుతామని ఎంఈవో చెప్పారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎన్‌హెచ్ఎం బృందం



ఆస్పత్రిని సందర్శించిన ఎన్‌హెచ్ఎం బృందం సభ్యులు

నర్సంపేట టౌన్, జూన్ 20 : నర్సంపేట జిల్లా ఆస్పత్రిని గురువారం నేషనల్ హెల్త్ మిషన్ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. వీరి వెంట ఆస్పత్రి డీసీహెచ్ డాక్టర్ పి.గోపాల్, సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రమ, శారద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర వైద్య బృందం



పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కేంద్ర వైద్య బృందం సభ్యులు

ఖానాపురం, జూన్ 20 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) గురువారం మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కేంద్ర బృందం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు, గదులను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లెప్రసీ, టీబీ, ఎన్‌సీడీ, ఎన్‌వీబీడీసీపీ కింద మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా కార్యక్రమాలపై అవగాహన, పనితీరుపై ఆరా తీశారు. ఇమ్యూనైజేషన్, మాతా శిశు సంరక్షణ, కీటక జనిత వ్యాదుల నిర్మూలన కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌గైకి, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ తేజ్ కిరణ్‌రెడ్డి, గోపాల్, జ్యోతి, రుచిత, కల్పన, రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల కొనుగోలుకు నగదును అందించాలి

గీసుగొండ, జూన్ 20 : చేపల పెంపకం కోసం మత్స్యకారుల సంఘాలకు చేపపిల్లల పంపిణీకి బదులు నగదును ఆయా సంఘాలకు అందించాలని జిల్లా మత్స్యకారుల సంఘం డైరెక్టర్ కంబాల అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఎలుకుర్తిలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంఘాలకు వివిధ ఏజెన్సీల ద్వారా చేపపిల్లలను ఉచితంగా అందిస్తున్నా, అవి నాణ్యంగా ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బూసాని రఘు నాయకులు శ్రీనివాస్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే మాధవరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

చెన్నారావుపేట జూన్ 20 : అమెరికాలో జరిగినా ఆట మహాసభలకు వెళ్లి, తిరిగి వచ్చిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి గురువారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమాన ఆశ్రయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ విదేశీ పర్యటన ముగించుకొని, కెనడాలో రైతులు పండించే పంటలను పరిశీలించి విజయవంతంగా స్వదేశానికి తిరిగి రావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా నాయకులు గజమాల, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్. జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, తప్పట రమేష్, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్. మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మండల నాయకులు కుండె కుమారస్వామి, యూత్ మండల అధ్యక్షుడు బండి హరీష్, జోరు వీరయ్య గౌడ్, సాదు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలు



శ్రీధర్

గీసుగొండ, జూన్ 20 : నిరుపేద నిరక్షరాస్య కుటుంబంలో జన్మించిన గిరిజన యువకుడు ఒకే ఏడాదిలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంతో పలువురు అభినందిస్తున్నారు. విశ్వనాథపురంనకు చెందిన వాంకుడోతు శ్రీధర్ టెన్త్ వరకు కొమ్మాల జెడ్పీ పాఠశాలలో, నర్సంపేటలో ఇంటర్, డిగ్రీని ఓ ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీలో కెమిస్ట్రీ పూర్తి చేసిన అతను ఉద్యోగ లక్ష్యసాధనలో పడ్డాడు. మార్చి 4న ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్‌గా, మే 17న ఎన్టీపీసీలో అసిస్టెంట్ కెమిస్ట్ ట్రైనీగా ఉద్యోగాలు సాధించాడు. కాగా తాజాగా ఈనెల 16న కేంద్రప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ శాఖలో ఎగ్జామినర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఉద్యోగం లభించింది. కాగా గెజిటెడ్ పేటెంట్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరటానికి సిద్ధపడుతున్నట్లు శ్రీధర్ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలి

చెన్నారావుపేట, జూన్ 20 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వెంటనే పూర్తి చేయాలని మండల స్పెషల్ అధికారి డాక్టర్ బాలకృష్ణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను సమర్పించాలన్నారు. పనులను పూర్తి చేసిన వాటికి మాత్రమే డబ్బులు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవిందరావు, మండల నోడల్ అధికారి సరళ, దయాకర్‌రావు. హెచ్ఎం పాపమ్మ, ఏఈ నరేష్, ఐసీడీఎస్ అధికారులు రాధ, మంజుల, అశోక్, స్వప్న పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ల సర్వేను పూర్తి చేయండి

చెన్నారావుపేట, జూన్ 20 : గ్రామాల్లో చేపడుతున్న మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వేను వెంటనే పూర్తి చేయాలని జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాపయ్యపేట, లింగగిరి, 16 చింతల్‌తండా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి తిరుగూ పూర్తి వివరాలను సమోదు చేయాలన్నారు. తాగు నీరు అందని వివరాలు తెలుసుకోవాలన్నారు. మిషన్ భగీరథ తాగు నీటిని వృథా కాకుండా చూడాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సరాఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజ్, మిషన్ భగీరథ డీఈ మంగీలాల్, ఏఈ, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలి

గీసుగొండ, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో చదువుల సత్యనారాయణ సూచించారు. గురువారం ప్రాథమిక పాఠశాలలకు వర్క్‌బుక్‌లను గీసుగొండ విద్యావనరుల కేంద్రంలో ఆయన గురువారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బడిబాటలో ఎన్‌రోల్ అయిన పిల్లలను పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పట్టాభి, ముత్యాలు, రవిందర్, ఎంఐఎస్ సారిక, సీఆర్పీలు రాజేష్, రవి, ఆనందం, సుధాకర్, వెంకటరమణి, డీవో రాజగోపాల్, శంకర్ పాల్గొన్నారు.

పత్తి రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

సంగెం, జూన్ 20 : పత్తి పండించే ప్రతి రైతుకు పంట రుణంఇవ్వాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దాపురం రమేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం అఖిల భారత రైతు సమాఖ్య ఏఐకే ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రమేష్ పత్తి రైతుల సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు, జిల్లా కోశాధికారి సింగతి మల్లికార్జున్, జిల్లా సహాయ కార్యదర్శి గోనె రామచందర్, నాయకులు సోమిడి రవి, జక్క అశోక్, సదానందం, బాబు, ఐలోని సురేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభం

సంగెం, జూన్ 20 : మండలంలోని కృష్ణానగర్, షాపురం గ్రామాల్లో గురువారం సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి నరహరి బోరు పనులను ప్రారంభించారు. కళావతి మాట్లా డుతూ షాపురం గ్రామంలో మంచినీటి పనుల కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఎస్‌డీఎఫ్ నిధులకింద రూ.4 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కృష్ణానగర్‌లో బోరు వేయడానికి మండల పరిషత్ నిధులనుంచి రూ.1లక్ష మం జూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో సంగెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు చొల్లేటి మాధవ రెడ్డి, జనగాం రమేష్, మడత కేశవులు, శ్రీను, సమ్మారావు, ఆంజనేయులు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

నల్లా నీళ్లు రాక అవస్థలు

నల్లబెల్లి, జూన్ 20 : మండల కేంద్రంలో దళిత కాలనీలో కొన్ని నెలల తరబడి ఇంటింటికి నల్లా నీళ్లు రావడం లేదని దళిత యువకులు నాగెల్లి రమేష్, మహేష్‌లు ఆరోపించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీకి 200 మీటర్లు దూరంలో ఉన్న దళిత కాలనీలో ఇంటింటికి భగీరథ నల్లా, జీపీ నల్లాల్లో నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం గ్రామ పంచాయతీకి మొరపెట్టుకుం టే అరకొరగా భగీరథ పైపు లైన్‌లు ఇంటింటికి వేయకుండా ప్రధాన రోడ్డు వరకు వేశారన్నారు. పంచాయతీ అధికారులు కాలనీని పరిశీలించి ప్రతీ ఇంటికి నల్లా నీళ్లు వచ్చేలా చర్య లు తీసుకోవాలని కోరారు. లేదంటే దళిత సంఘాల ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నారావుపేట, జూన్ 20 : మండలంలోని ముగ్దుంపురం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన కొమ్మ శివ, కొమ్మ చంద్రమౌళి అనే ఇద్దరు కలిసి ఓ ఇంట్లో అక్రమంగా 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారు. రేషన్ బియ్యాన్ని నిల్వ చేసిన సమాచారం గ్రామస్థులు అందించటంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు కలిసి, అక్కడ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇంట్లో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు బియ్యాన్ని నూకలు చేసే మిషన్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరిపై కేసు నమోదు చేసి, నిందుతులను ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆదర్శ పాఠశాలలో టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట, జూన్ 20 : మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టు కోసం దరఖాస్తులను చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మీ గురువారం తెలిపారు. పాఠశాలలో పీజీటీ మ్యాథ్స్ సబ్జక్టు బోధించే అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 22న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డెమోను 24న నిర్వహిస్తామని, అభ్యర్థులు ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు.

రణరంగం

(5వ పేజీ తరువాయి)

కౌన్సిల్ హాల్ లోనికి అనుమతించారు. కౌన్సిల్ హాల్‌లో సుమారు 20 మంది పోలీసులు కౌన్సిల్ హాల్‌లో ఎవరికీ అనుమానం రాకుండా అక్కడక్కడ కూర్చున్నారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్ఐలతో పాటు మహిళా, పురుష పోలీసు కానిస్టేబుళ్లు హాల్‌లో కూర్చున్నారు. కాంగ్రెస్ విపక్ష కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న తరుణంలో కొందరు మఫ్టీలో ఉన్న పోలీసులను గుర్తించారు. హాల్ నుంచి పోలీసులను పంపించాలని డిమాండ్ చేయడంతో హాల్‌లో ఉన్న పోలీసు సిబ్బంది బయటకు పంపించారు. బడ్జెట్ ఆమోదం తర్వాత ఇరువర్గాల బయట వెళ్లిపోయారు. బల్దియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ సమావేశానికి పోలీసులు హాజరు కావడం, కట్టుదిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయడాన్ని కొందరు నిరసించారు.

నిరసన

కొందరు విపక్ష కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశం నిర్వహించిన తీరుపై మండిపడ్డారు. కౌన్సిల్ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసనకు దిగి బైఠాయించారు. బల్దియా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీసు బందోబస్తు మధ్య బడ్జెట్ సమావేశం నిర్వహించడం సిగ్గుగా ఉందని మండిపడ్డారు. పోలీసులు కలుగజేసుకుని శాంతింపజేశారు. ఓ కార్పొరేటర్ భర్త మట్టివాడ ఎస్ఐ చొక్కా పట్టుకోవడంతో కొంత ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులను నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరడంతో సమస్య సద్దుమనిగింది.

బీఆర్ఎస్, బీజేపీలది అక్రమ సంబంధం

నాయిని రాజేందర్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్నట్లుగానే బీఆర్ఎస్, బీజేపీల అక్రమ సంబంధం బల్దియా బడ్జెట్ సమావేశంలో తేట తెల్లమైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండడంవల్ల వరంగల్ కార్పొరేషన్ అభివృద్ధి 20 యేండ్లు వెనక్కి పోయింది. కాకతీయ కళాతోరణం గురించి మాట్లాడడం సిగ్గుచేటు. పదేళ్లగా కాకతీయ ఉత్సవాలు చేయకుండా కాకతీయ తోరణం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్, బీజేపీలకు లేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో డిపాజిట్లు రాకపోవడం వల్ల నిరసనలు, అడ్డగింపులు చేస్తున్నారు. తెలంగాణ చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాన్ని ఎట్టిపరిస్థితిలో తీయనియ్యం. రూ.150కోట్ల స్మార్ట్‌సిటీ నిధులు ఎగిరిపోతుంటే ఎమ్మెల్యేలం తిరిగి తెచ్చాం.

నా రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలే..

బస్వరాజు సారయ్య, ఎమ్మెల్సీ

వరంగల్ మునిసిపల్ చరిత్రలో ఈ రోజు జరిగిన సంఘటనలు ఎప్పుడూ చూడలేదు. మంత్రి, ఎమ్మెల్యే హోదాలో పని చేయడంతో పాటు బల్దియాపై నాకు సుదీర్ఘ అనుబంధం కలిగి ఉంది. కానీ మునుపెన్నడూ లేనివిధంగా పోలీసు బందోబస్తు పెట్టి మరీ బల్దియా బడ్జెట్ సమావేశం నిర్వహించిన సందర్భాలు లేవు. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం పోలీసులు వెసులుబాటు కల్పించారు. కానీ బల్దియా సమావేశాన్ని పోలీసుల పహారాలో నిర్వహించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

రాజకీయ అడ్డాగా బల్దియా

చాడా స్వాతిరెడ్డి, బీజేపీ 52 డివిజన్ కార్పొరేటర్

వరంగల్ బల్దియా కార్యాలయం ప్రజల సంక్షేమం కోసం కాకుండా రాజకీయ అడ్డాగా మారింది. ఇక్కడి ప్రాంత అభివృద్ధిని పక్కనబెట్టి అధికారం కోసం పావులు కదుపుతున్నారు. బల్దియాలో జరిగింది బడ్జెట్ సమావేశం కాదు.. సొంత నిర్ణయాల వేదికగా చెప్పవచ్చు. ప్రభుత్వం మారడంతో మేయర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేసి కుర్చీ కోసం పాకులాడుతోంది. గత సంవత్సరం, ఈ సంవత్సరం బడ్జెట్‌లు పూర్తిగా ప్రజల మీద భారం మోపే విధంగా ఉన్నాయి. దీనిపై బహిరంగ చర్చకు రావాలి.